క్లుప్తంగా

ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా ఇంటి పన్ను



ఆన్‌లైన్ విధానంలో ఇంటిపన్ను చెల్లిస్తున్న గృహ యజమానులు

డెంకాడ: గ్రామాల్లో ఇంటి పన్ను చెల్లింపులు నగదు రూపంలోనే కాకుండా ఆన్‌లైన్ విధానంలో స్వీకరిస్తున్నట్లు పినతాడివాడ పంచాయతీ కార్యదర్శి ఎం.జగదీష్ తెలిపారు. బుధవారం పలువురు ఖాతాదారుల నుంచి ఆన్‌లైన్ విధానంలో పన్ను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహ యజమానులందరూ తప్పకుండా ఇంటి పన్ను చెల్లించాలని కోరారు.

కబడ్డీ పోటీల్లో రాణించిన యశ్వంత్



యశ్వంత్‌ని అభినందిస్తున్న హెచ్‌ఎం పద్మాదేవి, తదితరులు

నెల్లిమర్ల: చిత్తూరు జిల్లాలోని చౌడప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన అండర్‌-17 కేటగిరీ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున బరిలో ఉన్న మండలంలోని సారిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్ యశ్వంత్ ప్రతిభ కనబరిచాడు. వ్యక్తిగత ప్రతిభతో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో విద్యార్థి యశ్వంత్‌ను హెచ్‌ఎం పద్మాదేవి, పీడీ మోహనరావు, సిబ్బంది పాఠశాల ఆవరణలో బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ



రికార్డులను తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్

భోగాపురం: రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని జెడ్పీ సీఈఓ కె. రాజ్‌కుమార్ ఎంపీడీఓ నీలం అప్పలనాయుడుకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ రికార్డులతో పాటు 2022 - 2023 బడ్జెట్‌కు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దాసరి బంగారయ్య, ఏఓ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

చిక్కాలకు మాతృవియోగం



చిక్కాల సాంబశివరావును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

నెల్లిమర్ల: వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు మాతృమూర్తి చిక్కాల అప్పయ్యమ్మ బుధవారం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు. అలాగే అప్పయ్యమ్మకు నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



శ్రీరాములునాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు


నెల్లిమర్ల: మండలంలోని వల్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పంచాది శ్రీరాములునాయుడు తండ్రి సన్యాసప్పుడు సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం గ్రామానికి చేరుకుని శ్రీరాములు నాయుడును పరామర్శించారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ పి. సత్యనారాయణ, కనకారావు, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న నిరసనలు

విజయనగరం అర్బన్: విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం ఎదుట ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విజయనగరం జోన్ కమిటీ నిర్వహిస్తున్న నిరసనల కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. కార్యక్రమంలో జోన్ కమిటీ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి, జిల్లా కమిటీ అధ్యక్షుడు పీజీ రాఫిల్, కార్యదర్శి బీఎస్ రాములు, వివిధ డిపోల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా ఉందాం..

- విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు
- వాడవాడలా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు



డెంకాడ: చొల్లంగిపేట సచివాలయంలో సంక్షేమ,అభివృద్ధి పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, తదితరులు



నెల్లిమర్ల: ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు



విజయనగరం: సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



విజయనగరం రూరల్: డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు



పూసపాటిరేగ: చౌడువాడలో సంక్షేమ బోర్డును ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, జనార్ధనరావు, తదితరులు

విజయనగరం రూరల్: నాలుగున్నరేళ్లుగా అవినీతి రహిత పాలన సాగిస్తూ, రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా తీసుకువెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మనమంతా అండగా నిలుద్దామని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ నారాయణపురం గ్రామంలో బుధవారం 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ మామిడి అప్పలనాయుడు సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేస్తూ గ్రామ సచివాలయంలో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి, గ్రామాల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, పంచాయతీ కార్యదర్శి రవి, పార్టీ నాయకులు కూర్మారావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభ్యున్నతే ధ్యేయం..

విజయనగరం: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాలు నగరంలోని 16,19,24,39 డివిజన్‌లలో జరిగాయి. ఈ కార్యక్రమాలలో ఆయా డివిజన్ల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. 24వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు.. 16వ డివిజన్‌లో జోనల్ ఇన్‌చార్జ్ ముద్దాడ మధు పాల్గొన్నారు. ఆయా సచివాలయాలలో లబ్ధిదారుల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాలను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆశపు వేణు, ముద్దాడ మధు, గుజ్జుల నారాయణరావు, పిల్లా రాధాభవానీ, పొట్నూరు శ్రీనివాసరావు, వింత ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నేరుగా ప్రజల చెంతకే అందిస్తూ సుపరిపాలనకు నాంది పలికారన్నారు.రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు డాక్టర్ వీఎస్ ప్రసాద్, రెడ్డి గురుమూర్తి, ఆయా డివిజన్‌ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించాలి

డెంకాడ: రాష్ట్రంలోని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు వాటిని అందుకుంటున్న ప్రజలే సాక్షి అని, అలాంటి ప్రభుత్వాన్ని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు అన్నారు. మండలంలోని చొల్లంగిపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వాసుదేవరావు, వైస్ ఎంపీపీ తమ్మునాయుడు మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. పేదలను ఆర్థికంగా ఆదుకుని, అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చొల్లంగిపేట, డి.కొల్లాం సర్పంచ్‌లు కోరాడ కనకరాజు, అట్టాడ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గుడివాడ కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చౌడువాడ సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించడంతో పాటు వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లలో జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని గుర్తించుకుని మరలా జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, మొంగం నాగబాబు, కొయ్య ఎల్లన్నరెడ్డి, ఎంపీడీఓ ఎం.రాధిక, తదితరులు పాల్గొన్నారు.

జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలి

నెల్లిమర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైస్ ఎంపీపీ పి. సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కె. పైడినాయుడు, ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 2,3 తేదీలలో ఓటర్ల జాబితాపై ప్రత్యేక డ్రైవ్

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఓటరు ముసాయిదా జాబితాలపై జిల్లాలో వచ్చే నెల 2, 3 తేదీలలో ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ రాజకీయపార్టీల నేతలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిసెంబర్ 2, 3 తేదీలలో బూత్ స్థాయిలో స్పెషల్ కాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. ఆ రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు బీఎల్‌ఓలు బూత్ వద్ద ఉంటారని, బీఎస్‌ఏలు వెళ్లి జాబితాలను సరి చూసుకోవాలని తెలిపారు. 18, 19 ఏళ్ల వయసుగల ఓటర్లు తక్కువ సంఖ్యలో ఉన్నందున 17 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా చేర్పించేందుకు అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లతో వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడినట్లు తెలిపారు. ఓటర్లకు లక్షా మూడు వేల ఎపిక్ కార్డులను జనరేట్ చేయగా.. ఇందులో చాలావరకు పంపిణీ చేశామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ అనిత, ఈఆర్‌ఓలు వెంకటేశ్వరరావు, దొర, వైఎస్సార్‌సీపీ నుంచి రొంగల పోతన్న, టీడీపీ నుంచి కిమిడి నాగార్జున, ఐవీపీ రాజు, ఆప్ నుంచి దయానిధి, బీఎస్పీ నుంచి సోములు, కాంగ్రెస్ నుంచి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీల్లో క్యాష్‌లెస్ సేవలు



పంచాయతీ కార్యదర్శికి క్యాష్‌లెస్ యంత్రాన్ని అందిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో నగదు రహిత (క్యాష్ లెస్) సేవలకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో క్యాష్‌లెస్ (క్యూఆర్ కోడ్) సేవలు అందించడానికి మంజూరైన యంత్రాలను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శులకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు ప్రజలు చెల్లించే ఇంటిపన్ను, ఇతరత్రా పన్నులు వసూళ్లలో అవకతవకలు జరగకుండా పీఓసీ, క్యాష్‌లెస్ యంత్రాల ద్వారా చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్ విద్యతో ప్రయోజనం



మాట్లాడుతున్న రాష్ట్ర సమగ్రశిక్షణ సహిత విద్య విభాగం రిసోర్స్‌పర్సన్లు

విజయనగరం అర్బన్: దివ్యాంగ విద్యార్థులకు డిజిటలైజేషన్ విద్య ఎంతో ఉపయోగకరమని రాష్ట్ర సమగ్రశిక్షణా సహిత విద్య విభాగం రిసోర్స్‌పర్సన్లు డాక్టర్ వై.నరసింహం, డాక్టర్ ఎస్. అమ్మినాయుడు అన్నారు. విజన్‌-2025లో భాగంగా జిల్లాలోని దృష్టి, వినికిడి లోపం గల 209 మంది దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్షా ద్వారా ట్యాబ్‌లను ఇటీవల అందజేశారు. వాటి వినియోగం, డిజిటల్ సాధనాల ద్వారా విద్యాబోధనపై సమగ్రశిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులకు, ఐఈఆర్పీలకు బుధవారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ సాధనాల ద్వారా విద్యను సులభతరం చేసేందుకు ట్యాబ్‌లను అందజేసినట్లు చెప్పారు. విద్యార్థులు వీటిని సక్రమంగా వినియోగించేటట్లు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహిత సమన్వయకర్త ఎస్.సూర్యారావు, సహ సమన్వయకర్త ఎం.భారతి, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

విజయనగరం టౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు అన్నారు. ధర్మపురి రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్ ఉపయోగించి ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మహిళలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆలోచనాత్మకంగా వ్యవహరించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు లీడింగ్ ఫైర్‌మెన్ పి.మహేష్, సీహెచ్. సత్యనారాయణ, డి.గంగడు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంబలం పూజ



అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భోగాపురం: మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేదపండితులు అయ్యప్పస్వామి అంబలం పూజను బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీస్వామియే శరణం అయ్యప్ప శరణఘోషతో పూజా ప్రాంగణం మార్మోగిపోయింది. వేదిక మధ్యలో 18 మెట్లపై అభయముద్రలో ఉన్న అయ్యప్పస్వామిని, ఇరువైపులా లక్ష్మీమాత, వేంకటేశ్వరస్వామిలను కొలువుదీర్చారు. 18 మెట్లపై దీపాలు, ఫల, పుష్పాలను అలంకరించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన అన్నప్రసాదాలను భక్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆనందాల పొదరిల్లు ఆహుతి

- ఒకరివెంట ఒకరుగా గ్యాస్ ప్రమాద బాధితులు మృతి
- నాలుగు రోజుల వ్యవధిలోనే కుటుంబం కనుమరుగు
- వాంబేకాలనీలో అలుముకున్న విషాదం
- కాలనీవాసుల చందాలతో అంత్యక్రియలు



తండ్రి బాలరాజుతో పెద్ద కుమారుడు గిరి



చిన్న కుమారుడు కార్తీక్‌తో తల్లి చిన్ని

మధురవాడ / పీఎం పాలెం: ఆనందాల పొదరిల్లు అగ్నికి ఆహుతైపోయింది.. జీవితంపై ఎన్నో ఆశలు.. మరెన్నో కలలతో రెక్కల కష్టంతో ముందుకు సాగుతున్న ఆ చిన్ని కుటుంబం కలలన్నీ అగ్నికీలల్లో బూడిదైపోయాయి.. చేతికి అందొచ్చిన కుమారులను చూసుకుని మురిసిపోతున్న తల్లిదండ్రులను... ఆ తల్లిదండ్రులకు ఏ కష్టం రాకుండా వారు హాయిగా శేష జీవితం గడిపితే చూడాలనుకున్న కుమారులపై విధి కన్నెర్ర చేసింది.. ఒకరి వెంట ఒకరుగా వారం రోజుల వ్యవధిలో నలుగురినీ గ్యాస్ ప్రమాదం రూపంలో కబళించింది. బతుకుతెరువు కోసం నగరానికి పొట్ట చేత పట్టుకుని వచ్చిన ఈ కుటుంబం అర్ధంతరంగా కనుమరుగవడంతో మధురవాడ వాంబే కాలనీలో విషాదం నెలకొంది. వారం రోజుల కిందట ఇంటిలో గ్యాస్ లీకై సంభవించిన ప్రమాదంలో తల్లిదండ్రులు, వారి ఇద్దరు కుమారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఈ విషాద ఘటనకు సంబంధించి స్థానికులు, పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...

రెక్కల కష్టంతో జీవనం

విజయనగరం జిల్లా భోగాపురం మండలం సవరవిల్లి గ్రామానికి చెందిన యామల బాలరాజుకు అదే జిల్లా చింతలవలస సమీపంలోని బెల్లాంకు చెందిన చిన్నితో గతంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు గిరి, కార్తీక్. సంతానం కలిగిన తర్వాత వారికి మంచి భవిష్యత్ అందించాలన్న ఉద్దేశంతో బతుకుతెరువు కోసం పిల్లలను తీసుకుని విశాఖ నగరానికి వలస వచ్చేశారు. అలా పలుచోట్ల జీవించి 15 ఏళ్ల నుంచి మధురవాడ సమీప వాంబే కాలనీలో బ్లాక్ నంబర్ 27 బీలోని ఎఫ్‌ఎఫ్ 1, 2 ఇళ్లలో అద్దెకి ఉంటున్నారు. భార్య చిన్ని ఇళ్లల్లో పనులు చేస్తుండగా, బాలరాజు కార్పెంటరీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారులు గిరి ఓ కంపెనీ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తుండగా, కార్తీక్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. వీరిలో బాలరాజు, గిరి, కార్తీక్ కొద్ది రోజుల కిందట భవానీ మాల ధరించారు.

గ్యాస్ సిలిండర్ పిన్ బ్లాక్ అవ్వడంతో..

ఈ నెల 24న శుక్రవారం ఉదయం ఎఫ్‌ఎఫ్ 2 ఇంట్లో భవానీ మాలధారుల కోసం ప్రసాదం తయారు చేస్తున్నారు. ఆ సమయంలో సిలిండర్‌లో గ్యాస్ అయిపోవడంతో మరో సిలిండర్ అమర్చే క్రమంలో దాని పిన్ లోపలికి వెళ్లిపోయి బ్లాక్ అయిపోయింది. దీంతో బాగా గ్యాస్ లీకయింది. ఆ సమయంలో ఏమీ కనిపించక లైట్ వేయడంతో పాటు గదిలో దీపం కూడా ఉండడంతో... అప్పటికే ఇళ్లంతా వ్యాపించిన గ్యాస్ అంటుకుని అగ్నికీలలు ఎగసిపడ్డాయి. మంటలను ఆర్పేందుకు కుటుంబ సభ్యులంతా తీవ్రంగా యత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలో నలుగురూ మంటల్లో తీవ్రంగా కాలిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే 108 సాయంతో కేజీహెచ్‌కు తరలించారు. మరోవైపు అగ్నిమాపక శకటం మంటలను ఆర్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అలుముకున్న విషాదం

ఒకే కుటుంబానికి చెందిన నలుగురూ అగ్ని ప్రమాదంలో కాలిపోయి నాలుగు రోజుల వ్యవధిలోనే మృతి చెందడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. కాలిన గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ చిన్న కుమారుడు కార్తీక్(20) ఆదివారం మరణించాడు. ఆ బాధ నుంచి తేరుకోక ముందే పెద్ద కుమారుడు గిరి (21) మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. అతనికి అంత్యక్రియలు నిర్వహించడం ఆలస్యమవుతుందని మృతదేహాన్ని బుధవారం ఉదయం తీసుకొద్దామని బంధువులు ఆస్పత్రిలోనే ఉంచేశారు. ఇంతలో అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలరాజు (60), అతని భార్య చిన్ని (55) బుధవారం వేకువ జామున మరణించారు. మాలధారణలో వుండగా తండ్రి, ఇద్దరు కుమారులూ చనిపోవడంతో బంధువులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. కుటుంబంలో అందరూ చనిపోవడంతో తలకొరివి పెట్టే వారు కూడా కరువయ్యారని, ఇలాంటి పరిస్థితి పగవారికి కూడా రాకూడదని స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. నాయకులు ఇచ్చిన డబ్బులతో పాటు స్థానికులు చందాలు వేసుకుని అంత్యక్రియలు నిర్వహించి పెద్ద మనస్సు చాటుకున్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

విజయనగరం ఫోర్ట్: డిసెంబర్ ఒకటో తేదీన ఒంటితడి సబ్ స్టేషన్‌లో గల 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పూడి హరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో కోర్టు ఏరియా, ప్రదీప్‌నగర్, సీబీకాలనీ, అలకానంద కాలనీ, బొగ్గులదిబ్బ, ఎల్‌బీ కాలనీ, షాలిమార్ హోటల్, వివేకానంద కాలనీ, బీసీ కాలనీ, గోకపేట, ఆదిత్య నగర్, సూర్యనగర్, వివేకానంద కాలనీ, ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్, వైఎస్సార్‌నగర్, వీటీ అగ్రహారం, రొంగలివీధి, పెద్ద వీధి, ప్రియానగర్, డీమార్ట్, ఇండస్ట్రియల్ ఏరియా, గాంధీనగర్, వై జంక్షన్, దుర్గానగర్, ఆదర్శనగర్, ప్రసాద్‌నగర్, కొత్త మజ్జిపేట, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పశు ఆరోగ్యకార్డుల పంపిణీ వేగవంతం



రికార్డులు తనిఖీ చేసి, సిబ్బందికి సూచలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి విశ్వేశ్వరరావు

భోగాపురం: ఆవులు, గొర్రెలు, మేకలను పెంచుకుంటున్న పాడి రైతులకు వచ్చే నెలాఖరులోపు పశు ఆరోగ్య కార్డులను పంపిణీ చేయాలని జిల్లా పశువైద్యాధికారి ఎ. విశ్వేశ్వరరావు పశుసంవర్ధకశాఖ సహాయకులకు సూచించారు. మండలంలోని మంజేరు పశు వైద్యశాలలో పశు ఆరోగ్య కార్డుల పంపిణీపై పశు సంవర్ధకశాఖ సహాయకులతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశు ఆరోగ్యకార్డులలో పశుఆరోగ్య పరిరక్షణకు చేసే ప్రతి కార్యక్రమం నమోదు చేయబడుతుందన్నారు. టీకాలు వేసిన తేదీ, వ్యాధులకు చికిత్స, కృత్రిమ గర్భధారణ సూది వేసిన తేదీ, చూడి నిర్ధారణ, దూడ పుట్టిన తేదీ, తదితర వివరాలు పశుఆరోగ్య ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపర్చి ఉంటాయన్నారు. పశుసంవర్ధక శాఖ నుంచి అందుతున్న సేవలు, పథకాలు, ప్రయోజనాలపై పాడిరైతులకు వివరించాలని సహాయకులకు సూచించారు. అంతకముందు పశువైద్యశాలలో సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ కార్యాలయ పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావు, ఏరియా సహాయ సంచాలకుడు ఉమాశంకర్ మహాపాత్రో, పశు వైద్యాధికారి య. రామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ



నెల్లిమర్లలో ఈవీఎం గొడౌన్‌లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి

నెల్లిమర్ల: స్థానిక ఈవీఎం గోదాములను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. గదులను, వాటికి వేసిన సీళ్లను పరిశీలించారు. గోదాముల్లోని సీసీ కెమెరాల్లో చూసి ఈవీఎంల పరిస్థితిని తెలుసుకున్నారు. ఈవీఎం ఉన్నప్రతి చోట సీసీ కెమెరా ఉండాలని అని అధికారులకు తెలియజేశారు. గోదాముల వద్ద భద్రత పటిష్టం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో డీఆర్‌ఓ ఎస్డీ అనిత, తహసీల్దార్ డి.ధర్మరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.